RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే

దిన పత్రిక

మనకు లభించే చిన్న
అవకాశాలే భవిష్యత్తులో
ఉన్నత శిఖరాల్ని
చేరుస్తాయి
– బెంజమిన్ ఫ్రాంక్లిన్

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 177
గురువారం, జూన్ 11, 2026 , పేజీలు - 4 వెల : 2/-

# హైదరాబాద్ లో మహిళలకు సూపర్ న్యూస్..

## ఆ ఉద్యోగాలు మీ కోసమే.. హర్రీ అప్!



హైదరాబాద్, జూన్ 10:తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు మరియు చిన్నారి విద్యార్థులకు నాణ్యమైన పునాది విద్యను అందించేందుకు ప్రభుత్వం సరికొత్త అడుగులు వేస్తోంది. విద్యా శాఖపై తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి కారణంగా అనేక కీలక నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ ప్రైమరీ తరగతులకు ప్రభుత్వ స్కూల్స్ లో ప్రారంభిస్తున్నారు.హైదరాబాద్ జిల్లాలో ప్రీ ప్రైమరీ తరగతులు.. నియామకాలుఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రీ–ప్రైమరీ విభాగాన్ని బలోపేతం చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచడంతో పాటు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా చిన్న పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు వీలుగా ప్రత్యేక ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.మహిళా ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలను నియ మించనున్న సర్కార్‌నగర పరిధిలో ప్రాథమిక పాఠశాలలతో అనుసంధానమై ఉన్న ప్రీ–ప్రైమరీ క్లాసుల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. చిన్న పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకుని, వారికి ఆటపాటలతో కూడిన విద్యను అందించేలా మహిళా ఇన్‌స్ట్రక్టర్లను ఎంపిక చేస్తారు. దీనితో పాటు క్లాసుల్లో ఉండే చిన్న పిల్లల సంరక్షణ కోసం, వారిని కంటికి రెప్పలా చూసుకునేందుకు వీలుగా ఆయాలను కూడా నియమిం చను న్నారు.స్థానిక మహిళలకు ప్రాధాన్యతఈ నియామకాలను పూర్తిగా పారదర్శకంగా, స్థానిక అర్హతలకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పూర్తి చేయనున్నారు. ఈ ఉద్యోగాల కోసం అవకాశం ఉంది.

# ప్రధానిగా మోదీ కొత్త రికార్డు..

## కంగ్రాట్స్ చెప్పిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ: భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ కొత్త రికార్డు క్రియేట్ చేశారు. అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా చేసిన వ్యక్తిగా ఆయన నిలిచారు. గతంలో నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. ప్రధాని ఆఫీసులో 4399 రోజుల పాటు మోదీ వరుసగా ఆ బాధ్యతలను నిర్వర్తించారు. కేంద్రంలో 12 ఏళ్ల పాటు ప్రధానిగా ఉన్న మోదీకి ఇవాళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముశుభాకాంక్షలు తెలిపారు. అతిసుదీర్ఘ కాలం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన విశిష్ట గౌరవాన్ని పొందారని ముర్ము తన స్టేట్మెంట్‌లో తెలిపారు.భారత ప్రజలు మీ నాయకత్వంపై ఉంచిన నమ్మకానికి ఈ అసాధారణ మైలురాయి ఓ పరీక్షగా నిలుస్తుందని, నమ్మకానికి.. విశ్వాసాన్ని చాటుతుందన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రాష్ట్రపతి ముర్ము ఓ పోస్టు చేశారు. పరిపాలనలో ఆధునీకరణ, ఆర్థిక స్థిరత్వం సాధించడానికి నిదర్శనంగా మీ పాలన నిలుస్తుందన్నారు. మీరు చేరుకున్న మైలురాయి.. బలమైన భారత ప్రజాస్వామ్య?
సంప్రదాయంలో కొత్త ఉత్సహాన్ని, విశ్వాసాన్ని ఇస్తుందని ముర్ము అన్నారు.

### మంత్రివర్గంలోకి రాజగోపాల్ రెడ్డి, అక్కడే బిగ్ ట్విస్ట్

# ఇన్- అవుట్ వీరే...!?




హైదరాబాద్, జూన్ 10:తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనకు రంగం సిద్దం అవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నారేళ్ల పూర్తి కావటంతో.. మంత్రి వర్గంలో మార్పులు చేయాలని.. కొత్త వారికి అవకాశం ఇవ్వటంతో పాటుగా ప్రస్తుతం ఉన్న వారిలో కొందరిని తప్పించటం ఖాయం గా కనిపిస్తోంది. ఈ మేరకు పార్టీ హైకమాండ్ తో చర్చలు జరిగాయి. ఇక.. శాఖల వారీగా మార్పులు తప్పదని తెలుస్తోంది. ఇందుకు ముహూర్తం సైతం దాదాపు ఖరారు అయింది.తెలంగాణ మంత్రివర్గంలో భారీ మార్పులు ఉండే అవకాశం కనిపిస్తోంది. చాలా కాలంగా మంత్రి వర్గంలో మార్పుల పైన చర్చ జరుగుతోంది. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు... కేరళలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో దక్షిణాది పైన కాంగ్రెస్ ప్రత్యేకంగా ఫోకస్ చేస్తోంది. అందులో భాగంగా తెలంగాణలో ప్రభుత్వం.. పార్టీలో అవసరమై నిర్ణయాలకు కాంగ్రెస్ నాయకత్వం సిద్దమైంది.

# పీసా చట్టం.. ఆదివాసీల నిర్ణయాధికారానికి రక్షణ కవచం

## : మంత్రి సీతక్క



హైదరాబాద్, జూన్ 10: పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. ఈరోజు(బుధవారం) రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. పేద వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ..గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు.పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదు..
గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామ స్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల కల్పించాలన్నారు.

# ఖర్గే సారథ్యంలో ఏఐసీసీ అత్యవసర సమావేశం 11న



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ అత్యవసరంగా సమావేశమవుతోంది. జూన్ 11న ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది.ఖర్గే సారథ్యంలో ఏఐసీసీ అత్యవసర సమావేశం 11నన్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ అత్యవసరంగా సమావేశమవుతోంది. జూన్ 11న ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు.ఏఐసీసీ అత్యవసర సమావేశం ప్రధాన ఎజెండా ఏమిటనేది పార్టీ అధిష్ఠానం ఆ సర్క్యులర్‌లో పేర్కొనలేదు. అయితే మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ్య నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చిన అంశం ప్రధానంగా ఈ సమావేశంలో చర్చకు రానుందని, దీనికి సంబంధించి భవిష్యత్ కార్యచరణపై సమావేశంలో చర్చించనున్నారని తెలుస్తోంది.మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరి ంచడంతో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు బుధవార ంనాడు కలిసి ఫిర్యాదు చేసింది. తక్షణం చర్యలు తీసుకో వాలని కోరింది. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యని ఆరోపించింది. దీనిపై న్యాయపోరాటానికి కూడా కాంగ్రెస్ సిద్ధమ వుతోంది. మరోవైపు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిగా నిలబెట్టిన మహేశ్ కావత్ విజయంపై బీజేపీ ధీమాగా ఉంది.

# కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం..

### సోనియా గాంధీ ప్రతిపాదన.. మమతా బెనర్జీ స్పందన



బెంగాల్: టీఎంసీ పార్టీని మమతా బెనర్జీ కాంగ్రెస్‌లో విలీనం చేస్తారా..? ఈ అంశంపై తాజాగా మమతా బెనర్జీ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ చర్చించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సన్నిహితులుగా పేరు తెచ్చుకున్నవారు కూడా ఆ పార్టీని వీడుతున్నారు.దీంతో టీఎంసీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇదే సమయంలో మమతా బెనర్జీ.. సోనియా గాంధీతో భేటీ ఢిల్లీలోని ఆమె నివాసంలో అయ్యారు. ఈ సందర్భంగా బెంగాల్ రాజకీయాలతోపాటు, జాతీయ రాజకీయాలపై కూడా చర్చ జరిగింది. బీజేపీ వరుస విజయాలు, బెంగాల్‌లో బీజేపీ నేతల ఒత్తిడి కారణంగా టీఎంసీ నేతలు పార్టీని వీడుతున్నారని మమత.. సోనియాకు తెలిపారు. ఈ నేపథ్యంలో సోనియా గాంధీ.. మమతకు ఒక కీలక సూచన చేశారు. టీఎంసీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని ఆమె మమతను కోరారు. అయితే, దీనిపై మమత ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విశ్వసనీయ సమాచారం.

# ఇరాన్‌పై అమెరికా దాడులు..


### అపాచీ హెలికాప్టర్ కూల్చడంపై ప్రతీకారం..



అమెరికా : పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితుతులు ఏర్పడ్డాయి. ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తోంది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకు పడుతోంది. అమెరికా వైమానిక దళానికి చెందిన అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ డ్రోన్ దాడితో కూల్చేసింది. హోర్ముజ్ జలసంధి వద్ద, ఒమన్ తీరంలో హెలికాప్టర్‌ను పేల్చివేసింది. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌పై తీవ్రంగా దాడులు చేస్తామని హెచ్చరిం చారు. దీంతో ఇరాన్‌పై అమెరికా మళ్లీ దాడులకు దిగింది. హోర్ముజ్ జలసంధి పరిధిలోని క్వెష్మ్ ఐలాండ్‌తోపాటు పోర్ట్ సిటీ అయిన సిరిక్‌పై కూడా అమెరికా దాడి చేసిందని ఇరాన్ తెలిపింది. జాస్క్ కౌంటీ సమీపంలోని బందార్ అబ్బాస్ వద్ద కూడా పేలుడు జరిగిందని ఇరాన్ వెల్లడించింది. ఇరాన్ దక్షిణ భాగంలోని అనేక ప్రాంతాలపై అమెరికా దాడి చేస్తోందని ఆ దేశం తెలిపింది. తమ హెలికాప్టర్‌పై జరిగిన దాడికి బదులుగా, ఆత్మరక్షణ విధానంలో భాగంగానే దాడులు చేస్తున్నామని అమెరికా ప్రకటించింది. ఈ దాడులపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు.

# అద్భుతమైన, విశిష్టమైన నాయకుడు

## : సీఎం చంద్రబాబు



అమరావతి: తన 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎంతో మంది ప్రధాన మంత్రులను అత్యంత దగ్గరగా పరిశీలించానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కానీ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒక అద్భుతమైన, విశిష్టమైన నాయకుడని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. తన 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎంతో మంది ప్రధాన మంత్రులను అత్యంత దగ్గరగా పరిశీలించానని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కానీ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒక అద్భుతమైన, విశిష్టమైన నాయకుడని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. బుధవారం న్యూఢిల్లీలో ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలు సమావేశమ య్యారు.అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపించారు. 50 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ప్రధాని నరేంద్ర మోదీ లాంటి విశిష్టమైన నాయకుడిని తాను చూడలేదన్నారు. భారతదేశాన్ని ప్రప ంచంలోనే అగ్రగామిగా ముందుకు తీసుకెళ్లే అన్ని శక్తి సామర్థ్యాలు ప్రధాని మోదీకి ఉన్నాయని తెలిపారు.ప్రధాని మోదీ భారత రాజకీయాల్లో ఒక సరికొత్త చరిత్ర తను సృష్టించారని పేర్కొన్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్య తలు చేపట్టినప్పటి నుంచి నేటి వరకు నరేంద్ర మోదీ నిరంతరం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికవుతూనే ఉన్నా రని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజాదరణతో అధికా రంలో కొనసాగుతున్న అరుదైన రికార్డు చంద్రబాబు చెప్పారు.

# ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు, క్రీడా కేంద్రాలు

**- పటాన్చెరు ఎమ్మెల్యే, ఉమ్మడి మెదక్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి**





**పటాన్ చెరు, జూన్ 10:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో క్రీడాకారుల కోసం కోచింగ్ కేంద్రాలు, క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి క్రికెట్ క్లబ్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పటాన్చెరు ఎమ్మెల్యే, అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒలంపిక్ డే సందర్భంగా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతి త్వరలో ఒలింపిక్ రన్, మొక్కలు నాటడం, సైకిల్ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా క్షేత్రస్థాయి నుండి క్రీడా పోటీలు, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధి కోసం ఐదు మినీ స్టేడియాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మైత్రి మైదానం వేదికగా ఏడాది పొడవునా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రఘునందన్ రెడ్డి, ఎల్లయ్య, హరికిషన్, బుచ్చిరెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని కలిసిన శాపురం నరసింహారెడ్డి



**పటాన్ చెరు, జూన్ 10: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముత్తంగి డివిజన్ (జిహెచ్ఎంసి-265) ప్రతినిధి శాపురం నరసింహారెడ్డి ఈరోజు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి రాజ్యసభ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ భేటీలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు, ముత్తంగి డివిజన్ పరిధిలోని స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం మరియు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఇరువురు నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాపురం నరసింహారెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం నిర్దేశించిన మార్గంలో ముత్తంగి డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశ నిర్దేశించింది - మంత్రి పొన్నం ప్రభాకర్







**మెదక్,జూన్,10,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ. 199.08 కోట్ల పెట్టుబడితో 553 టీజీఎస్ ఆర్ టి సి, బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమి ష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు రుణాల కోసం ఎదు రుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ. 69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ. 3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ. 20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ. 10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు. మహిళలు ఆదా చేసుకున్న ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. మహిళల చేతిలో మిగిలే ప్రతి రూపాయి కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి దోహదపడుతుందని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులు కేటాయించబడినట్లు మంత్రి తెలిపారు. ఇందులో మెదక్ జిల్లాకు 20, సిద్దిపేట జిల్లాకు 23, సంగారెడ్డి జిల్లాకు 25 బస్సులు కేటాయించామని చెప్పారు. దీంతో ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ప్రతిభావంతులకు ఘన సన్మానం



**?చేగుంట, జూన్ 10 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభల సమావేశంలో భాగంగా చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో పదో తరగతి ఉత్తమ ఫలితాల కరపత్రాన్ని (పాంప్లెట్‌ను) విడుదల చేశారు. రెడ్డిపల్లి సర్పంచ్ చిన్నశెన్న నరసింహ, ఎంపీడీఓ చిన్నారెడ్డి లు కలిసి మొదటగా రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 500లకు పైగా మార్కులు సాధించి ఘన విజయం సాధించిన విద్యార్థులు పాండు (556), నిఖిత (549), రఘువర్మ (547), గణేష్ (541), బిందు (535), అభిషేక్ (526), శైలజ (523), రాధ (521), దివ్యకుమారి (519)లను ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు, ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమల పాత్ర కీలకం: పటాన్చెరులో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అవగాహన సదస్సు

**పటాన్ చెరు, జూన్ 10: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

"99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (సంగారెడ్డి) ఆధ్వర్యంలో పటాన్చెరులోని ఐలా సమావేశ మందిరంలో పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశ్రమల్లో ప్లాస్టిక్ తగ్గింపు, పర్యావరణ బాధ్యత మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈ శిక్షణ శిబిరం కేంద్రీకృతమైంది.

**పర్యావరణ నియమాలపై అధికారుల దిశానిర్దేశం**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంయుక్త ప్రధాన పర్యావరణ ఇంజనీర్ శ్రీ కె. శ్రీనివాస రెడ్డి, సీనియర్ పర్యావరణ ఇంజనీర్ శ్రీ బి.వి. భద్ర గిరీశ్ మాట్లాడుతూ.. పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. వాతావరణ మార్పుల సవాళ్లు, చక్రాకార ఆర్థిక వ్యవస్థ, వ్యర్థాల శాస్త్రీయ వర్గీకరణ, ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ నిర్మూలన వంటి అంశాలపై వారు వివరించారు. నిబంధనల అమలులో న్యాయస్థానాల పాత్ర మరియు స్వీయ నియంత్రణ ఆచరణల ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్లు కుమార్ పాఠక్, ఎన్. విజయలక్ష్మి, మాధురి మరియు ఐలా చైర్మన్ దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

**పరిశ్రమల భాగస్వామ్యం**

సదస్సులో జె.కె. ఫెన్నర్ (ఇండియా) లిమిటెడ్, సెఖ్మెట్ ఫార్మావెంచర్స్ మరియు న్యూలాండ్ లాబొరేటరీస్ ప్రతినిధులు తమ సంస్థల్లో అమలు చేస్తున్న 'పర్యావరణ-సామాజిక--పాలనా విధానాల' పై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు తాము చేపట్టిన చర్యలను వివరించారు.



**పర్యావరణహిత పరిశ్రమలే లక్ష్యం**

ఈ సదస్సుకు సుమారు 80 మంది పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. పరిశ్రమలు కేవలం ఉత్పత్తిపైనే కాకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో సామాజిక బాధ్యతను కూడా నెరవేర్చాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా ప్రతి పరిశ్రమ ముందుకు సాగాలని సూచిస్తూ కార్యక్రమం ముగిసింది.



# అమీన్‌పూర్ మండలంలో ప్రీ-ప్రైమరీ తరగతుల నిర్వహణ - దరఖాస్తుల ఆహ్వానం ఎంఈఓ సుధాకర్.

**అమీన్‌పూర్, జూన్ 10:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

అమీన్‌పూర్ మండలంలోని పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) తరగతులను ప్రారంభించేందుకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం సిద్ధమైంది. ఈ ప్రక్రియకు సంబంధించి మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ, కీలక వివరాలను వెల్లడించారు. మండలంలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు మరియు ఆయాల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని ఆయన తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించిన పూర్తి సమాచారం మరియు షెడ్యూల్‌ను, సంబంధిత పాఠశాలల ప్రాంగణంలో నోటీసు బోర్డులపై ప్రదర్శించామని ఎంఈఓ సుధాకర్ స్పష్టం చేశారు.



ఈ తరగతులు ప్రారంభం కానున్న పాఠశాలలు:

1. ప్రాథమిక పాఠశాల, సుల్తాన్‌పూర్
2. ప్రాథమిక పాఠశాల, ఐలాపూర్
3. ప్రాథమిక పాఠశాల, ఐలాపూర్ తండా
4. ప్రాథమిక పాఠశాల, నరే గూడెం
5. ప్రాథమిక పాఠశాల, బొమ్మనకుంట
6. ఉన్నత ప్రాథమిక పాఠశాల, బందంకొమ్ము
7. ప్రాథమిక పాఠశాల, 2బిహెచ్‌కె
8. ప్రాథమిక పాఠశాల, అమీన్‌పూర్ వీకర్ సెక్షన్
9. ప్రాథమిక పాఠశాల, ఉస్కబావి

ఎంఈఓ సుధాకర్ సూచించిన ముఖ్యాంశాలు:
- నియామకం: ప్రతి పాఠశాలకు ఒక ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఒక ఆయాను ఎంపిక చేస్తారు. - గౌరవ వేతనం: ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు 8,000 రూపాయలు మరి యు ఆయాలకు 6,000 రూపాయల వేతనం అందజేయబడుతుంది. - ఎంపిక విధానం: స్థానిక నివాసితులకు, అంటే సంబంధిత గ్రామం, పంచాయతీ, మండల పరిధిలోని వారికి నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుంది. - దరఖాస్తు గడువు: ఆసక్తి గల వారు ఈ నెల 13వ తేదీలోపు తమ దరఖాస్తులను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలి. స్థానికంగా నిరుద్యోగ యువత, ముఖ్యంగా అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సుధాకర్ కోరారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే నేరుగా ప్రధానోపాధ్యాయులను లేదా మండల కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

# దోపిడీకి 'శానిటేషన్' కేరాఫ్ అడ్రస్..

# అమీన్‌పూర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారుల వసూళ్ల దందా

**- 'తాయి బజార్' గడువు తీరినా వదలని వసూళ్ల పర్వం.. సామాన్యుల నెత్తిన భారం మోపుతున్న శానిటేషన్ డిపార్ట్‌మెంట్!**



అమీన్‌పూర్, జూన్ 10:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన జీహెచ్‌ఎంసీ శానిటేషన్ విభాగం.. ఇప్పుడు ఏకంగా 'వసూళ్ల విభాగం'గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని మార్కెట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, జీతం తీసుకుంటున్న సర్కారు ఉద్యోగులే చిరు వ్యాపారుల జేబులు కొల్లగొడుతున్న వైనంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల 'పవర్'.. వ్యాపారుల 'కన్నీళ్లు':**

గతంలో ' తాయి బజార్ ' కాంట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. కానీ ఆ గడువు ముగిసి మూడు నెలలు కా వసున్నా, శానిటేషన్ సిబ్బంది మాత్రం ఆ పద్ధతిని వదల్లేదు. మార్కెట్ వద్ద కూర్చుని వ్యాపారులను బెదిరిస్తూ ఒక్కొక్కరి నుంచి 40 నుంచి 50 రూపాయల వరకు వసూలు చేస్తున్నారంటే, వారి అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది కేవలం వసూలు మాత్రమే కాదు, వ్యాపారుల కడుపు కొట్టే అక్రమ దోపిడీ.

**మాజీ కాంట్రాక్టర్ల సంచలన ఆరోపణలు:**

గతంలో తాము టెండర్లు పాడి చట్టబద్ధంగా వ్యాపారం చేసినప్పుడు, వసూళ్లపై కంప్లైంట్లు చేసిన వారే.. ఇప్పుడు అధికారులు అక్రమంగా డబ్బులు దండుకుంటున్నా ఎందుకు మౌనంగా ఉన్నారని తాయి బజార్ మాజీ కాంట్రాక్టర్లు భూపాల్, మహేష్ ప్రశ్నిస్తున్నారు. "మేము లక్షలు కట్టి వ్యాపారం చేస్తే తప్పుపట్టిన అధికారులు, ఇప్పుడు సిబ్బంది బాహాటంగా దోచుకుంటుంటే కళ్లు మూసుకుని ఎందుకు కూర్చున్నారు?" అని వారు నిలదీశారు.

**డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ గారికి ఏం తెలియదా?**

అమీన్‌పూర్ జీహెచ్‌ఎంసీలో అధికారులు చేస్తున్న ఈ దందాకు డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ గారి మౌనమే మద్దతా? అని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. శానిటేషన్ విభాగం చేస్తున్న ఈ విచ్చలవిడి వసూళ్లపై కనీసం విచారణ జరపకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న సిబ్బంది.. అదనంగా 50 రూపాయల కోసం రోజువారీ వ్యాపారులను పీడించడం అమానవీయం. డిమాండ్: శానిటేషన్ డిపార్ట్‌మెంట్ చేస్తున్న ఈ అనధికారిక వసూళ్లపై వెంటనే సమగ్ర విచారణ జరపాలి. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ దందాను ప్రోత్సహిస్తున్న అధికారుల బండారాన్ని బయటపెట్టాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, శానిటేషన్ విభాగంలో వేళ్లూనుకుపోయిన ఈ అవినీతిపై కొరడా ఝుళిపించకపోతే, బాధితుల ఆగ్రహం రోడ్డెక్కడం ఖాయం.

# ఎయిర్ ఫోర్స్ అకాడమీ పాసింగ్ అవుట్ పరేడ్ ఏర్పాట్ల పరిశీలన: భద్రతపై ఎస్పీ ప్రత్యేక దృష్టి





పటాన్ చెరు, జూన్ 10: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లాలోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఈ నెల 13న నిర్వహించనున్న 'పాసింగ్ అవుట్ పరేడ్' (శిక్షణ పూర్తి చేసుకున్న వారి వీడ్కోలు కవాతు) నేపథ్యంలో, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ నేడు అకాడమీ ప్రధాన ద్వారం వద్ద భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, జిన్నారం సిఐ రమణారెడ్డి తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పరతోష్ పంకజ్ గారు మాట్లాడుతూ, "ఎయిర్ ఫోర్స్ అకాడమీలో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక వేడుకకు భారీ సంఖ్యలో అతిథులు, ఉన్నతాధికా రులు హాజరవుతున్నారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. పరేడ్ జరిగే పరిసరాల్లో నిరంతర నిఘా ఉంచడంతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేశాం. అకాడమీ యాజమాన్యంతో సమన్వయం చేసుకు ంటూ వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలి," అని ఆయన సూచిం చారు. వేడుకలకు వచ్చే అతిథుల రాకపోకలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానిక పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా విధులను నిర్వర్తించాలని ఆయన సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

# గాంధీనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

**- ప్రజా-పోలీసు సంబంధాల బలోపేతానికి కమ్యూనిటీ పోలీసింగ్**
**- సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**- 45 వాహనాలు తాత్కాలిక సీజ్**
**- సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్**







మెదక్,జూన్,10,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ లక్ష్యంగా మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 70 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 45 వాహనాలను తాత్కాలికంగా సీజ్ చేశారు. సంబంధిత వాహన యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి తమ వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ నేరాల నిర్మూలన, ప్రజల రక్షణ, భద్రతాభావం కల్పించడంలో భాగంగానే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు లేదా నేరచరిత్ర కలిగిన వ్యక్తులు ఆశ్రయం పొందుతున్నారా అనే విషయాలను గుర్తించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అద్దెకు ఇల్లు తీసుకోవడానికి వస్తే వారి పూర్తి వివరాలు సేకరించడంతో పాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారనే నమ్మకాన్ని పెంపొందించడం, ప్రజా-పోలీసు సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా డిజిటల్ అరెస్ట్, ఫోన్ కాల్ బ్లాక్‌మెయిల్, ఓటీపీ మోసాలు, పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్స్, ఫేక్ లింకుల ద్వారా జరిగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద కాల్స్, సందేశాలకు స్పందించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా జూబి స్నిఫర్ డాగ్‌తో పాటు పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైస్‌లను వినియోగించినట్లు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, వారి వివరాలను ధృవీకరించడం, నేరస్తులను గుర్తించడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్నామని చెప్పారు. అలాగే 18 సంవత్సరాలు నిండని బాలికను వివాహం చేసుకోవడం, ఆమె అంగీకారం తెలిపినా కూడా చట్టం దృష్టిలో అది తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ప్రేమ పేరుతో మైనర్ బాలికను తీసుకువెళ్లడం, ప్రలోభపెట్టడం వంటి చర్యలు కూడా తీవ్రమైన నేరాల కింద పరిగణించబడతాయని హెచ్చరించారు. బాలల రక్షణ కోసం పోక్సో చట్టం కఠినంగా అమలవుతోందని తెలిపారు. వాహనాల కొనుగోలు సమయంలో అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని, ఆర్సీని తప్పనిసరిగా తమ పేరుపై బదిలీ చేసుకోవాలని సూచించారు. వాహనంపై ఫైనాన్స్ లేదా ఇతర బకాయిలు ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు మహేష్, రాజశేఖర్ రెడ్డి, జర్జ్, ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చివరి దశలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**- 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**
**ధాన్యం కొనుగోలు రైతులకు 725.13 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్,జూన్,10,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

జిల్లాలో ధాన్యం కొనుగోలు చివరి దశలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వరకు 88,672 మంది రైతుల నుంచి 3,89,364.120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,68,413 మంది రైతుల బ్యాంకు ఖాతాలో 725.13 కోట్ల రూపాయలు చెల్లింపులు జరిపామన్నారు. ఇప్పటి వరకూ 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు. రైతులు అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# గ్రామ సభలతో గ్రామాల అభివృద్ధి

**- రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు ప్రణాలు కొల్పోకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి.**
**- జిల్లా కలక్టర్ ప్రతిమా సింగ్**
**- అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాలు.**
**- ప్రయాణంలో సురక్షితంగా గమ్యం చేరడం కోసం అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ఉద్యమం**
**- రోడ్లపై పరిస్థితులను గమనిస్తూ ముందుకు సాగాలి**
**- ఎక్కువ మంది హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.**
**- రోడ్డు ప్రయాణంలో అవగాహన, చైతన్యం, మార్పు రావాలి.**
**--అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన**








మెదక్,జూన్,10,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రామ సభలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత , అవగాహన కార్యక్రమం నిర్వహించి పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులు లతో కలిసి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించడం జరిగినది, అనంతరం పౌరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. పరిసరాల పరిశుభ్రత, అరైవ్ అలైవ్ ఈ అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సుకు జిల్లా కలక్టర్ ప్రతిమా సింగ్,అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్,ఎస్పీ శ్రీనివాస్ రావు హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. పౌరులతో కలసి ర్యాలీ నందు పాల్గొన్నారు. కలక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ .. ప్రజల భాగస్వామ్యం తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని గ్రామసభలతో ప్రజా సమస్యల పరిష్కారం పచ్చదనం, పారిశుధ్యంపై దృష్టి సారించాలితడి చెత్త, పొడి చెత్త నిర్వహణ పక్కాగా జరగాలని.. బహిరంగ ప్రదేశాల్లో అస్సలు చెత్త వేయకూడదని, తగుల బెట్టకూడదన్నారు పర్యావరణ పరిరక్షణ లో భాగం గా చెత్త విభజన, పరిసరాల పరిశుభ్రత మీద ప్రజలకి అధికారులు అవగాహన కల్పించాలన్నారు వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని...పైపులైన్లకు మరమ్మత్తులు, నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. జిల్లా అభివృద్ధి, జిల్లా రక్షణ , పౌరుల రక్షణ ముఖ్యమైనది, పౌరుల భద్రత రక్షణలో పోలీసు శాఖ అనుక్షణం పని చేస్తుంది అని కలెక్టర్ తెలిపరూ. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు, గ్రామ సభలు నిర్వహిస్తున్నాం ప్రజలను చైతన్య పరుస్తున్నాం అన్నారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ,జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయసహకారాలు అందిస్తే రహవీర్ గా గుర్తింపు వస్తుంది అన్నారు, రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అంటే రోడ్డు పై ప్రయాణం చేసేసమాజంలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడం. ప్రతి సంవత్సరంకాలంలో తెలంగాణ వ్యాప్తంగా 7500 కు పైగా ప్రాణాలు కోల్పోతున్నారు అన్నారు, మన జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే సంభవిస్తున్నాయి, తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, పిల్లలు వాహనాలు నడపడం, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి వీటిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు జాగ్రతగా అవగాహనలో వాహనాలు నడపాలి, రోడ్లపై ప్రయాణ సమాజంలో చైతన్యం మార్పు రావాలి అన్నారు. పోలీసు శాఖ అనుక్షణం అవగాహన కల్పిస్తూ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తున్నది అన్నారు. డ్రైవింగ్ చేయాలాంటే, అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఎక్కువ మంది హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు అని గంకాలు చెప్తున్నాయి అన్నారు. విద్యాసంస్థలు ప్రారంభం అవుతున్నాయి విద్యార్థులను బస్సులు, ఇతర వాహనాలు కండిషన్ లేకుంటే సీజ్ చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు., రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. పోలీసు కళాబృందం వారు పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి ,తూప్రాన్ ఆర్డీవో బావయ్య పాల్గొన్నారు.


# కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య



పాపన్నపేట,జూన్,10,మెదక్ టుడే న్యూస్

కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని పొడ్చెన్ పల్లి గిరిజన తాండ లో చోటుచేసుకుంది. పోలీసులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలాఉన్నాయి. పొడ్చెన్ పల్లి గ్రామానికి చెందిన కేతావత్ శ్రీను నాయక్ (28) ఓ ప్రయివేటు పెట్రోల్ పంపులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన కేతావత్ నిఖిత తో ఐదు సంవత్సరాల క్రితం వివాహం చేయగా సంసారం సపిగా సాగి ఇరువురు మగ సంతానం కావడం తో ఆర్థిక ఇబ్బందులతో తరుచు భార్య, భర్తల మధ్య గొడవ జరుగుతుండేదని. మంగళవారం మృతుడు విధులు ముగించుకొని ఇంటికి రాగ భార్య తో గొడవ జరుగడం తో ఈ విషయమై మృతుడు గ్రామ పెద్దల వద్ద చెప్పడం తో గ్రామ పెద్దలు ఇరువురిని పిలిపించి. నచ్చజెప్పి పంపించి వేశారు. అయితే సాయంత్రం మళ్ళీ భార్య, భర్తల మధ్య గొడవ చోటుచేదుకోవడం తో తీవ్ర మనోవేదనకు గురైన మృతుడు చస్తేనే సమస్యకు పరిష్కారం అంటు ఇంటి నుండి బయటకు వెళ్ళి తమ వ్యవసాయ క్షేత్రం లో ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు మృతుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి వ్యవసాయ క్షేత్రం లో చెట్టుకు ఉరి వేసుకున్న మృతుణ్ణి గుర్తించి వెంటనే కిందకు దింపి మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచేందున్నట్లు ధ్రువీకరించడం తో మృతుడి తల్లి దేవ్లీ పాపన్నపేట పోలీసుల కు పిర్యాదు చేయడం తో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని కుటింబికులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి తల్లి దేవ్లీ, భార్య నిఖిత, ఇరువురు కుమారులు ఉన్నారు.

## ఎనిమిదో తరగతికే లక్ష ఫీజు! - ప్రైవేటు స్కూళ్ల అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట ఎలా?



**హైదరాబాద్:** పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆశయాన్ని పలు ప్రైవేట్? పాఠశాలల యాజమాన్యాలు అవకాశంగా మలుచుకుంటున్నాయి. ప్రతి ఏడాది ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ మధ్యతరగతి, పేద వర్గాలపై అధిక భారాన్ని మోపుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో చాలా వాటిలో సీబీఎస్?ఈ, ఒలంపియాడ్?, ఐఐటీ ఫౌండేషన్?, టెక్నో, ఐఐటీ ఫౌండేషన్? పేరిట ప్రచారంతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. నర్సరీ, ఎల్?కేజీ, యూకేజీల్లోనే రూ.50 వేలలోపు వసూలు చేస్తున్నారు. ఇక కొత్త అడ్మిషన్? అయితే అదనంగా రూ.2 వేల వరకు చెల్లించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.జగిత్యాలకు చెందిన లక్ష్మీనారాయణది దిగువ మధ్యతరగతి కుటుంబం. స్థానికంగా ఓ వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నారు. తన కుమార్తె నాలుగో తరగతి, కుమారుడు 8వ తరగతి చదువుతున్నారు. అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించడానికి వెళ్లగా నాలుగో తరగతికి రూ.40 వేలు, ఎనిమిదో తరగతికి రూ.72 వేలు ఫీజు చెల్లించాలని యాజమాన్యం తెలపడంతో అవాక్కయ్యారు.నియంత్రణ కరువు : ప్రైవేట్? స్కూల్?ల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో కొన్ని యాజమాన్యాలు అధికంగా నిర్ణయించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా వసూలు చేయాలి. గతంలో ప్రాథమిక తరగతులకు రూ.9వేలు, ఉన్నత తరగతులకు రూ.13 వేలకు సర్కారు నిర్ణయించగా ఆయా యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీంతో సదరు ఉత్తర్వులు నిలిపివేశారు. అప్పటినుంచి పాఠశాల యాజమాన్యాలే ఫీజులు నిర్ణయించుకునే వెలుసుబాటు కల్పించింది. ఫీజుల క్రమబద్ధీకరణకు కమిటీ లేకపోవడంతోనే ఈ సమస్యకు కారణమైంది."అధిక ఫీజుల వసూళ్లకు సంబంధించి మాకెలాంటి ఫిర్యాదు రాలేదు. ఫీజుల నిర్ణయం ఆయా పాఠశాలల యాజమాన్యాలదే. సౌకర్యాలకు సంబంధించి నిబంధనలు అతిక్రమిస్తే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం" - రాము, డీఈవో, జగిత్యాలఅన్నింటికీ చెల్లించాల్సిందే! : 5వ తరగతి నుంచి 7 తరగతి వరకు రూ.35 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజులున్నాయి. 8వ తరగతి నుంచి 10వ తరగతికి రూ.లక్ష పైనే ఉంది. మరి ఇంత ఫీజులు ఎందుకని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పిల్లలకు ఐఐటీ ఫౌండేషన్? కోర్సు బోధిస్తున్నామని ఏదో మాటలు చెబుతున్నారు. మరోవైపు పాఠశాల యూనిఫాం, టై, బూట్లు, బెల్ట్? ఇలా అన్నింటికీ ప్రత్యేక ధరలు నిర్ణయించి తమవద్దే కొనుగోలు చేయాలని యాజమాన్యాలు నిబంధన విధించాయి. కానీ దీనివల్ల తల్లిదండ్రులకు అదనపు భారం అవుతోంది.పుస్తకాల కొనుగోలుకు రూ.3-8 వేల వరకు : ప్రైవేటు ఉద్యోగుల వేతనాలు, ఉపాధి శ్రామికులు, రోజువారీ కూలీల వేతనాలు ప్రతి ఏడాది పెరిగే పరిస్థితి ఉండదు. అయితే పిల్లల చదువులకు వచ్చేసరికి ప్రతి ఏటా స్కూల్? ఫీజులకు, పుస్తకాలకు వెచ్చించే ఫీజు చెల్లింపులు పెరుగుతుంది. కేవలం నర్సరీ చదువుకు పాఠశాల పరిస్థితిని అనుసరించి రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇవన్నీ చూస్తుంటే చదువులు ఎంత ఖరీదుగా ఉన్నాయనే విషయం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కేవలం పుస్తకాలు కొనుగోలు చేసేందుకే రూ.3 నుంచి రూ.8 వేల వరకు పాఠశాల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు.యాజమాన్యాల కాసుల వర్షం : కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో 1000 నుంచి 2000 మంది వరకు విద్యార్థులు ఆయా తరగతుల్లో చదువుతున్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైతే ఆ యాజమాన్యాలకు కాసుల వర్షం కురుస్తోంది. ఉదాహరణకు ఆ పాఠశాలలో 2000 మంది విద్యార్థులు ఉన్నారనుకుంటే సుమారుగా ఒక్కో విద్యార్థిని రూ.5 వేలు చొప్పున అనుకున్న కేవలం పుస్తకాల మీదే రూ.కోటికి పైగా వ్యాపారం జరుగుతోంది. దీనిలో సుమారు 40 శాతం వారికి లాభం ఉండనుంది.

## కర్ణాటకలోని ఉడిపిలో తెలంగాణ పర్యాటకుడిపై దాడి - నిందితుడు అరెస్టు



**హైదరాబాద్:** కర్ణాటకలోని ఉడిపి శ్రీ కృష్ణ మఠం ప్రాంగణంలో హైదరాబాద్ వ్యక్తిపై స్థానిక వ్యక్తి దాడి చేశాడు. వాహనం పార్కింగ్? చేసే సమయంలో మొదలైన వాగ్వాదం క్రమంగా స్టాండ్, కుర్చీ, ఇనుప వస్తువులతో దాడి చేసుకునేంత వరకు దారితీసింది. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన వ్యక్తిని ఉడిపి సిటీ పోలీసులు అరెస్టు చేశారు.అసలేం జరిగిందంటే : పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన రంగారావు తన కుటుంబంతో కలిసి శ్రీ కృష్ణ మఠాన్ని దర్శించుకోవడానికి ఉడిపికి వెళ్లారు. అక్కడ కారు పార్క్ చేసి రోడ్డు దాటుతుండగా, ఓ కారు వేగంగా వారి దగ్గరి నుంచి వచ్చింది. దీంతో ఆగ్రహించిన రంగారావు, వాహనం నడుపుతున్న? సుప్రీత్ కుమార్?తో వాగ్వాదానికి దిగారు. దీంతో వాదన కాస్త పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో రంగారావుపై సుప్రీత్ కర్రతో దాడిచేశాడు. దీంతో రంగారావు తలకు గాయం అయ్యి తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కాగా ఉడిపి సిటీ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 71/2026 కింద కేసు నమోదైంది.ఇనుప వస్తువులతో తనపై దాడి చేశారని : ఇంకో వైపు అదే ప్రాంతానికి చెందిన సుప్రీత్ కుమార్ మరో ఫిర్యాదు దాఖలు చేశారు. అతడి ఫిర్యాదు ప్రకారం, తెలంగాణ రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న ఓ వాహనం నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ అతడి ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ విషయం గురించి ప్రశ్నించినప్పుడు ఆ కారులోని డ్రైవర్?, ఇతర వ్యక్తులు అక్కడే తనతో వాదనకు దిగారని చెప్పాడు. దగ్గరలో ఉన్న ఫోటో స్టాండ్, కుర్చీ, ఇనుప వస్తువులతో తనపై దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో సుప్రీత్ నాలుకకు గాయమై రక్తస్రావం జరిగిందన్నారు. ఈ దాడులతో కారు ముందు అద్దం, సైడ్ మిర్రర్ కూడా దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించి క్రైమ్ నంబర్ 72/2026 కింద ఫిర్యాదు నమోదైంది.

# ప్రజా పాలనా -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమం

**-- రోడ్డు ప్రమాదాల నివారణలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం**

**-- అదనపు డీజీపీ సంజయ్ కుమార్**

**-- ట్రాఫిక్ నిబంధనల పాటనతోనే ప్రమాదాల నివారణ సాధ్యం**

**-- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**







**మెదక్,జూన్,10,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**

ప్రజా పాలనా -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెదక్ జిల్లా మసాయిపేట్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు డీజీపీ శ్రీ సంజయ్ కుమార్ ( టి జి ఎస్ పి బెటాలియన్స్) హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు డీజీపీ శ్రీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. చిన్న వయస్సులోనే రోడ్డు భద్రతపై సరైన అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.అలాగే ప్రతి తల్లి తన కుమారులు, కుటుంబ సభ్యులు ఇంటి నుండి బయటకు వెళ్లే ముందు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం, అతివేగంగా వాహనాలు నడపకపోవడం వంటి భద్రతా సూచనలు తప్పనిసరిగా గుర్తు చేయాలని అన్నారు. కుటుంబ సభ్యుల అవగాహన, పర్యవేక్షణ కూడా రోడ్డు ప్రమాదాల నివారణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ వినియోగించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొంటూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించాలంటే ప్రభుత్వం, పోలీస్ శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు మరియు ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అరైవ్ అలైవ్" సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరణలో పెట్టాలని కోరారు.తదనంతరం మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ, వాహనాలు నడపకూడదని, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.చివరగా గ్రామ సభలో పంచాయతీ మరియు మండల పరిధిలోని ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి, ట్రాఫిక్ నియమాల పాటనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ ఆర్డీఓ, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, సైదా, ఎస్ఐలు, గ్రామ సర్పంచ్, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా రైతుల అవసరాలకు సరిపడా ప్రస్తుతం 6,515 వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు యూరియా నిల్వలు

**- ప్రతి స్టాక్ పాయింట్ లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ**

**- గతంలో కంటే మెరుగ్గా ఇప్పటివరకు 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

**- గత యాసంగి సీజన్‌లో జిల్లాలో సుమారు 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

**- ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాలలో రూ.720.00 కోట్లు నేరుగా జమ**

**- జిల్లాలో సుమారు 10,000 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలుకు మిగిలి ఉన్నది**

**- 95% కొనుగోలు పూర్తి**

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్,జూన్,10,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**

జిల్లాలో ధాన్యం కొనుగోలు యూరియానిలువలపై జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ

మెదక్ జిల్లాలో యాసంగి 2025-26 ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నిరంతరాయంగా కొనసాగుచున్నది. గత యాసంగి సీజన్‌లో జిల్లాలో సుమారు 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడగా, ప్రస్తుత యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరగడం వల్ల ఇప్పటివరకు 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడిందన్నారు.

గత సంవత్సరంతో పోల్చితే ధాన్యం రాక అధికంగా ఉండటం వల్ల రవాణా, అన్‌లోడింగ్ మరియు నిల్వల నిర్వహణపై అదనపు ఒత్తిడి ఏర్పడినప్పటికీ, కొనుగోలు ప్రక్రియ ఎక్కడా నిలిచిపోలేదని స్పష్టం చేయడమైనది.ఇప్పటివరకు మెదక్ జిల్లాలో రైతుల నుండి 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడినది. దీనికి సంబంధించి రైతుల ఖాతాలలో రూ.720.00 కోట్లు నేరుగా జమ చేయడమైనది. గత సంవత్సరంతో పోల్చితే ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం రాక గణనీయంగా పెరిగినందున కొనుగోలు కేంద్రాలు, రవాణా మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలపై అదనపు భారం ఏర్పడినది. అయినప్పటికీ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సివిల్ సప్లైస్, రెవెన్యూ మరియు పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు, రవాణా మరియు రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ప్రస్తుతం జిల్లాలో సుమారు 10,000 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలుకు మిగిలి ఉన్నది. మిగిలిన ధాన్యాన్ని కూడా రాబోయే రెండు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేయుటకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టబడినవి. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అదనపు రవాణా వాహనాలు, ఇంటర్మీడియట్ గోదాములు మరియు సిబ్బందిని అందుబాటులో ఉంచి యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగించబడుతున్నవి. రైతులు ఎలాంటి ఆందోళనకు లేదా అధైర్యానికి గురికావలసిన అవసరం లేదని తెలియజేయడమైనది.అదేవిధంగా, ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాల కారణంగా కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవడం, రవాణాలో స్వల్ప అంతరాయాలు ఏర్పడినప్పటికీ రైతులకు నష్టం కలగకుండా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, అదనపు సిబ్బంది మరియు ఇతర అవసరమైన వసతులు కల్పించబడినవి.

అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతులు ఎలాంటి ఆందోళనకు లేదా అధైర్యానికి గురికావలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు మరియు మార్గదర్శకాల మేరకు వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయుటకు చర్యలు కొనసాగుతున్నవి. రైతులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉన్నదని తెలియజేయడమైనది. మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వేగవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సుమారు 95 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన కొనుగోలు ప్రక్రియను కూడా అత్యంత త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు మరియు రవాణా శాఖలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నవి. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉన్నదని మరోసారి స్పష్టం చేయడమైనది.అందువల్ల ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయినట్లు లేదా రైతుల ధాన్యం కొనుగోలు చేయబడదనే విధంగా జరుగుతున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమైనదని స్పష్టం చేస్తున్నామన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, అధైర్యపడకుండా కొనుగోలు ప్రక్రియపై విశ్వాసంతో ఉండాలన్నారు. జిల్లాలో సరిపడ యూరియా నిల్వలు గురించి కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలోని 6, 515 మెట్రిక్ టన్నుల యూరియా అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు.పక్కాగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని, స్టాక్ పాయింట్లకు ఎరువుల నిల్వలు చేరవేశామని కలెక్టర్ వివరించారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో తనిఖీల పర్యవేక్షణ కోసం 24 టాస్క్ ఫోర్స్ బృందాలు నిరతరం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

కొల్చారం లోని మల్లికార్జున ఎరువుల దుకాణంకు స్టాప్ సేల్స్ విషయంలో నోటీసులు జారీచేశామని తెలిపారు.

# చేగుంట రెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సభ

**చేగుంట జూన్ 10 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రోజున గ్రామసభ నిర్వహించారు గ్రామ సర్పంచ్ సిహెచ్ నరసింహ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి చిన్నారెడ్డి ఏపీవో శ్వేత పంచాయతీ కార్యదర్శి సమీనా సుల్తానా వ్యవసాయ ఏఈఓ మాధవి వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో టీ చిన్నారెడ్డి మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు వర్షాకాలం సమీపిస్తున్న వేళ గ్రామంలో దోమల బెడద లేకుండా మురుగు కాలువలు తీయించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు సర్పంచ్ సిహెచ్



నరసింహ మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలు అభిప్రాయాలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే గ్రామ సభ ఉద్దేశమని వారు అన్నారు.ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, ఎంపీడీవో టీ చిన్నారెడ్డి,ఏపీవో శ్వేత, వ్యవసాయ విస్తరణ అధికారి మాధవి,పంచాయతీ కార్యదర్శి సమీనా సుల్తానా, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..